# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 102 క్రిష్ణా, బుధవారం 07 - 01 - 2026 పేజీలు : 4 వెల. 2 /-







## రాజముద్రలతో పాస్ పుస్తకాలు పంపిణీ ఆనందంతో రైతులు





**ఏలూరు జిల్లా ముదినేపల్లి::::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి:::** రాజముద్రలతో పాస్ పుస్తకాలు పంపిణీ ఆనందంతో రైతులు ముదినేపల్లి మండలం పెద్దపాలపర్రు లో గ్రామ సర్పంచ్ గంటా రాకేష్ కుమార్ అధ్యక్షతన ముఖ్య అతిధులుగా ఏం.ఎల్.ఏ.కామినేని శ్రీనివాస్, ఎన్.డీ.ఏ.కూటమి నాయకులతోను,ఏం.అర్.ఓ లతీఫ్ ఫాషా,ఏం.పి.డి.ఓ. రామకృష్ణ, టీ.డీ.పీ.మండలాధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి,కైకలూరు నియోజకవర్గ టీ.డీ.పీ. కన్వీనీర్ వీరమల్లు నరసింహారావు, బి.జే.పీ. సీనియర్ నాయకులు కోటప్రోలు కృష్ణ, పైడిపాటి శివ శంకర్,బి.జే.పీ. పార్టీ ముదినేపల్లి మండలాధ్యక్షురాలు సత్యవోలు నాగ లక్ష్మ, జెనసేన మండలాధ్యక్షులు వీరంకి వెంకటేశ్వరరావు, మోటేపల్లి హనుమ,ఏ.ఎన్.బాబు లతో కలసి రైతులకు రాజముద్ర కల్గిన భూమి యాజమాన్య హక్కు కలిగిన పట్టాదార్ పాస్ పుస్తకాలని పంచిపెట్టారు ఈ కార్యక్రమం లో కామినేని మాట్లాడుతూ రైతులకు హక్కు కలిగిన భూమి స్వేగా అనుభవించేందుకు వీలుని కల్పిస్తూ ఎన్.డీ.ఏ.కూటమి లో చంద్రన్న తీసుకున్న నిర్ణయాన్ని అమలు పర్చారని, గత ప్రభుత్వం లో రైతులు భూములుని కూడా, 22c ఏc నిషేధిత జాబితాలలో నమోదు చేయటం జరిగిందని,రీసర్వే ద్వారా అందరి భూములకు అధికారులు న్యాయం చేస్తున్నారని ,గవర్నమెంట్ వారు భూమి లేని నిరుపేదలకు ఇచ్చిన భూములును,రాజకీయ స్వాతంత్ర్య సమర యోధులకు ఇచ్చిన భూములుని, మాజీ సైనికులకు ఇచ్చిన భూములని కూడా నిషేధిత జాబితాలో నుండి తొలగించి వారికి ఇచ్చిన భూమి పై సంపూర్ణ హక్కులని కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారని, రెవెన్యూ అధికారులకి తెలియ చేసి మీ భూమికి హక్కుదారులవ్వాలన్నారు ఎన్.డీ.ఏ.కూటమి ప్రభుత్వం చంద్రన్న,పవన్ కళ్యాణ్, కేంద్రంలో బి.జే.పీ. పార్టీ కలసికట్టుగా ఆంధ్రప్రదేశ్ ని అభివృద్ధి పదం లో నడిపిస్తున్నారని,భారత దేశంలోనే అతి పెద్ద పెట్టుబడులు ఆంద్రరాష్ట్రానికి వచ్చాయన్నారు రైతులులకు మురుగు కాలువల పుడికతీత పనులు చేసామని,రోడ్లు మరామత్తులు చేస్తున్నారని, నియోజక వర్గంలోని అన్ని గ్రామాలలోని ప్రజలకు కాళ్లకు మట్టి అంటకుండా సీ.సీ. రోడ్లు వేస్తున్నామని,కరెంట్ కోతలు లేకుండా యూనిట్లని నిర్మిస్తున్నామన్నారు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ సమస్యలని పరిష్కరిస్తున్నామన్నారు ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయతీ సెక్రటరీ, వి.అర్.ఓ. మాజీ సొసైటీ ప్రసిడెంట్ నెక్కంటి మోహనరావు,సొసైటీ డైరెక్టర్ పల్లపోతు ప్రసాద్,ఎలిశెట్టి లక్ష్మ నరసింహారావు,చల్లగుళ్ల ఆదిత్య చౌదరి, ఎన్.డి.ఏ. కూటమి నాయకులు,కార్యకర్తలు,మహిళ లు,రైతులు,గ్రామస్తులు పాల్గొన్నారు

## భోగాపురం విమానాశ్రయంపై వైసీపీ దిక్కుమాలిన రాజకీయం చేస్తోందన్న కృష్ణప్రసాద్

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 06,** భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ పై కూటమి ప్రభుత్వం – వైసీపీ మధ్య క్రెడిట్ పంచాయితీ తారాస్థాయికి చేరింది. రెండు రోజుల క్రితం మొదటి వాలిడేషన్ ఫ్లైట్ స్ససెస్‌ఫుల్‌గా ల్యాండ్ అయిన తర్వాత ఈ రచ్చ మరింత ముదిరింది. ఈ నేపథ్యంలో మైలవరం టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వైసీపీపై ఘాటుగా విరుచుకుపడ్డారు.భోగాపురం ఎయిర్‌పోర్ట్‌పై వైసీపీ నీతిమాలిన రాజకీయాలు చేస్తోంది. ఎవరికో పుట్టిన బిడ్డను తన బిడ్డ అని చెప్పుకునే స్థాయికి వైసీపీ నాయకులు దిగజారారు అంటూ ఎద్దేవా చేశారు. వైసీపీ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా సూచనలు ఇస్తే స్వీకరిస్తామని, కానీ ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. మెడికల్ కాలేజీల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కూటమి కృషి చేస్తుంటే, వైసీపీ కోటి సంతకాల పేరుతో కుట్రలు పన్నుతోందని విమర్శించారు. అనవసర రాజకీయాలు మాని ప్రజల మేలు కోసం పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో కొంత అయినా ప్రజలు ఆదరిస్తారని, ఆ విషయం వైసీపీ నేతలు గ్రహించాలని సూచించారు.కాగా, భోగాపురం ప్రాజెక్ట్ 2015లో చంద్రబాబు హయాంలో మొదలైంది. భూసేకరణ, టెండర్లు టీడీపీ హయాంలోనే పూర్తయ్యాయి. ఇప్పుడు మళ్లీ కూటమి వచ్చాక పనులు వేగవంతమయ్యాయి. వైసీపీ ఇప్పుడు క్రెడిట్ కొట్టే ప్రయత్నం చేస్తోందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు, భోగాపురం విమానాశ్రయంలో ఈ ఏడాది జూన్ నాటికి కమర్షియల్ ఆపరేషన్స్ మొదలయ్యే అవకాశం ఉంది



## అమరావతిలో మెరీనా వాటర్ ఫ్రంట్ ఏర్పాటుకు సీఎం ఆమోదం



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 06,** నవ్యాంధ్ర రాజధాని అమరావతికి పర్యాటక రంగంలో సరికొత్త శోభను తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కృష్ణా నదీ తీరాన్ని అంతర్జాతీయ స్థాయిలో ఃమెరీనా వాటర్ ఫ్రంట్ఃగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మంగళవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 57వ సీఆర్డీఏ అథరిటీ సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. అమరావతిని ప్రపంచ పటంలో ఒక ప్రత్యేక పర్యాటక కేంద్రంగా నిలపాలన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.మెరీనా వాటర్ ఫ్రంట్‌లో భాగంగా జెట్టీలు, పర్యాటకుల కోసం లీజర్ బోట్లు, ఫుడ్ ప్లాజాలు, ఆహ్లాదాన్ని పంచే ల్యాండ్‌స్కేప్ పనులను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. వాటర్ ఫ్రంట్ రూపకల్పన కోసం ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని, రివర్ ఫ్రంట్‌తో పాటు వాటర్ స్పోర్ట్స్ యాక్టివిటీస్‌కు కూడా ఇందులో చోటు కల్పించాలని స్పష్టం చేశారు. ఃబ్లూ-గ్రీన్ సిటీఃగా అమరావతిని తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా అంతర్గత కాలువల నిర్మాణం, సుందరీకరణ పనులు వేగవంతం చేయాలన్నారు.ప్రకాశం బ్యారేజీకి ఎగువన నిర్మించనున్న నూతన బ్యారేజీతో రాజధానికి నీటి వనరులు సమృద్ధిగా అందుబాటులోకి వస్తాయని చంద్రబాబు వివరించారు. దీనివల్ల కృష్ణా నదికి ఇరువైపులా అద్భుతమైన వాటర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసుకునేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. నదిలో ఉన్న ఐల్యాండ్స్‌ను కూడా పర్యాటకపరంగా ఎలా అభివృద్ధి చేయవచ్చో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాజధాని కోసం భూములిచ్చిన భూమిలేని నిరుపేదలకు ఇస్తున్న పెన్షన్‌ను, తల్లిదండ్రులను కోల్పోయిన మైనర్ అనాథలకు కూడా వర్తింపజేయాలని నిర్ణయించారు. దీని ప్రకారం అర్హులైన మైనర్లకు నెలకు రూ. 5,000 చొప్పున పెన్షన్ అందనుంది. అదేవిధంగా, రైతులకు కేటాయించిన ప్లాట్లలో వాస్తురీత్యా అనుకూలంగా లేని 112 ఃవీధిశూలఃప్లాట్లకు బదులుగా మరోచోట ప్రత్యామ్నాయ ప్లాట్లను కేటాయించేందుకు అంగీకారం తెలిపారు. అయితే, మ్యుటేషన్ పూర్తికాని, థర్డ్ పార్టీకి విక్రయించని ప్లాట్లకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం నొక్కిచెప్పారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఆర్డీఏ సంస్థలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రత్యేక రెవెన్యూ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని, ఆస్తులను సమకూర్చుకుని సుస్థిర ఆదాయం పొందేలా రెండు సంస్థలు ఎదగాలని దిశానిర్దేశం చేశారు. అమరావతిలో తలపెట్టిన స్పోర్ట్స్ సిటీ వంటి ప్రాజెక్టుల కోసం ఖతార్ మోడల్‌ను అధ్యయనం చేయాలని సూచించారు. రాజధాని నిర్మాణ పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, పురపాలక, సీఆర్డీఏ, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

## అటవీశాఖ ఆంక్షలు

**క్రైం కౌంటర్ న్యూస్,** ఆత్మకూరు, జనవరి 6: నల్లమలలోని నాగార్జునసాగర్–శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలో జరుగుతున్న అఖిల భారత పులుల గణన–2026 నేపథ్యంలో శ్రీశైలానికి కాలినడకన తరలివెళ్లే భక్తులకు అటవీశాఖ పలు ఆంక్షలు వి?ధించింది. ఈ మేరకు మంగళవారం ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ విఘ్నేష్‌అప్పావ్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతి నాలుగేళ్లకు ఓసారి జరిగే పులుల లెక్కింపు ప్రక్రియలో భాగంగా ఎనఎస్‌టీఆర్ పరిధిలో జనవరి 3 నుంచి 31వ తేది వరకు ఫేస్–3 దశల్లో మెరా ట్రాప్స్ ద్వారా పులుల గణన ప్రక్రియను చేపడుతున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా తొలిబ్లాక్‌లో ఎంపిక చేయబడిన ఆత్మకూరు, నాగలూటి, శ్రీశైలం రేంజుల పరిధిలో ఫిబ్రవరి 13వ తేది వరకు పులుల గణన ప్రక్రియ జరుపుతున్నట్లు చెప్పారు. అయితే ఇదే సమయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లమల అటవీ మార్గం మీదుగా భక్తులు కాలినడకన వెళ్లనున్న నేపథ్యంలో శాస్త్రీయ పద్ధతిలో జరగుతున్న పులుల గణాంకాల ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు తాత్కాలికంగా పలు ఆంక్షలను విధిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వెంకటాపురం నుంచి పాదయాత్రగా వెళ్లే భక్తులకు కేవలం ఫిబ్రవరి 8 నుంచి 15వ తేదీ వరకు మాత్రమే అనుమతిస్తామని వెల్లడించారు. మిగతా రోజుల్లో దోర్నాల మీదుగా రోడ్డు మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని మల్లన్న భక్తులు గమనించి పులుల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా జరిపేందుకు సహకరించాలని కోరారు.

ఎనఫోర్స్‌మెంటు బృందాల ఏర్పాటు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 : సరిహద్దు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమంగా పెట్రోలియం రవాణా కాకుండా కట్టడి చేయడానికి ఎనఫోర్స్‌మెంటు బృందాలను ఏర్పాటయ్యాయి. మంగళవారం తన చాంబరులో అక్రమ పెట్రోలియం రవాణాపై ఎనఫోర్స్‌మెంటు ప్రొటెక్షన కమిటీతో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక నుంచి ఆంధ్రప్రదేశలోకి అక్రమంగా అనుమతి లేకుండా పెట్రోలియం తరలించి ఇక్కడ విక్రయిస్తున్నారన్నారు. కర్ణాటకలో ధరలు తక్కువగా ఉండటం వల్ల ఇలా చేస్తున్నారనీ దీనివల్ల రాష్ట్రానికి పన్ను ఆదాయం తగ్గడమే కాకుండా సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. దీనిని అరికట్టడానికి సివిల్ సప్లైస్ కమిషనర్ ఆదేశాల మేరకు జాయింట్ ఎనపోర్స్‌మెంటు కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంబంధిత కమిటీలో రవాణాశాఖ, లీగల్ మెట్రాలజీ శాఖ, సివిల్ సప్లైస్ శాఖ, కమర్షియల్ ట్యాక్స్ శాఖలు నాలుగు విబాగాలుగా కలిసి పని చేస్తాయన్నారు. ఈ బృందాలు సంయుక్తంగా వారానికి రెండుసార్లు తనిఖీలు నిర్వహించాలని జేసీ ఆదేశించారు. లీగల్ మెట్రాలజీ వారు స్టాంపింగ్, కాలిబ్రేషన సరిగ్గా ఉన్నాయో లేదో చూడాలన్నారు. ఏవైనా అక్రమాలు జరిగితే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీటీసీ శాంతకుమారి, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఆయిల్ కంపెనీ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో 12 నుంచి సంక్రాంతి ఉత్సవాలు

**క్రైం కౌంటర్ న్యూస్,** శ్రీశైలం, జనవరి 6 శక్తిపీఠం, జ్యోతిర్లింగ క్షత్రం శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 12వ తేదీ సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమై 18వ తేదీన ముగుస్తాయని ఆలయ పాలకమండలి చైర్మన పోతుగుంట రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం వారు పత్రికాప్రకటన విడుదల చేశారు. ఏడు రోజులపాటు పంచాహ్నిక దీక్షలతో స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహిస్తారు. 12వతేది ఉదయం యాగశాల ప్రవేశంతో ప్రారంభమై సాయంత్రం ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజపట ఆవిష్కరణ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరుగుతాయి. 13 నుంచి వాహనసేవలు ప్రారంభమై 15 వతేది సంక్రాంతి రోజున లీలా కల్యాణం, 18వతేది ఆఖరిరోజున పుష్పోత్సవ, శయనోత్సవాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అదే విధంగా బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలైన గణపతిహోమం, రుద్ర, మృత్యుంజయం, చండీ హోమాలతోపాటు వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, స్వామిఅమ్మవార్ల లీలా కల్యాణోత్సవాలు ఉదయాస్తమానసేవ, ప్రాతఃకాల సేవ, ప్రదోషకాలసేవ, ఏకాంతసేవలను తాత్కాలికంగా



నిలుపుదల చేస్తున్నట్లు శ్రీశైల దేవస్థానం అధికారులు వెల్లడించారు.



# తిరుమలలో ఖాళీ మద్యం సీసాల ఘటన,,,,పోలీసుల కేసు నమోదు

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 06, తిరుమలలో ఇటీవల ఖాళీ మద్యం సీసాలు దొరకడం కలకలం రేపిన సంగతి తెలిసిందే. పదుల సంఖ్యలో ఖాళీ మద్యం సీసాలు లభ్యం కావటం చర్చనీయాంశమైంది. తిరుమలలోని పోలీస్ అతిథి గృహం సమీపంలో పదుల సంఖ్యలో ఖాళీ మద్యం సీసాలు అంటూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కాగా.. టీటీడీ కూడా స్పందించింది. బాలాజీనగర్‌కు ఆనుకుని ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో చెట్ల మధ్యలో ఈ ఖాళీ మద్యం బాటిళ్లు కనిపించినట్లు టీటీడీ క్లారిటీ ఇచ్చింది. ఇందుకు కారణమైన వారిని గుర్తిస్తామని.. విధుల్లో అలసత్వం ప్రదర్శించిన వారిపై చర్యలు తీసుకుంటామంటూ తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటించింది. తాజాగా తిరుమలలో ఖాళీ మద్యం సీసాల ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ ఘటనలో ముగ్గురి పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఓ వైసీపీ నేతతో పాటుగా.. ఇద్దరు మీడియా ప్రతినిధుల ప్రమేయం ఇందులో ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలిలోకి మొదటగా వైసీపీ నేతకు చెందిన వాహనం వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఇద్దరు మీడియా ప్రతినిధులు అక్కడకు వచ్చినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. మద్యం బాటిళ్ల దృశ్యాలను చిత్రీకరించిం.. వాటిని సోషల్ మీడియాలో పోస్టు చేసినట్లు పోలీసులు గుర్తించారు.


మరోవైపు తిరుమల పోలీస్ అతిథి గృహం వద్ద ఖాళీ మద్యం బాటిళ్లు కనిపించాయనే వార్తపై పోలీసులు కూడా స్పందించారు. పోలీస్ అతిథి గృహం వద్ద మద్యం సీసాలు దొరికాయంటూ ప్రచారం జరుగుతోందని.. అందులో పోలీస్ అతిథి గృహానికి ఎలాంటి సంబంధం లేదంటూ తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ పని చేశారా.. లేదా ఆకతాయిలు ఎవరైనా తాగి పడేశారా అనే దానిపై దర్యాప్తు జరుపుతామని.. సీసీ కెమెరాల ద్వారా అసలు సంగతి తేలుస్తామని తిరుపతి పోలీసులు వెల్లడించారు. తాజాగా ఈ ఘటనలో ముగ్గురి పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపనున్నారు. అయితే తిరుమలలో మద్యం సీసాలు దొరకటంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అలిపిరి చెక్ పోస్టు వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాట్లు ఉంటే కొండపైకి మద్యం బాటిళ్లు ఎలా వెళ్లాయంటూ ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి.

# పార్కింగ్‌కు స్థలాలు లేక ట్రాఫిక్ పాట్లు



క్రైం కౌంటర్ న్యూస్, నరసన్నపేట, జనవరి 6 : నరసన్నపేట పట్టణంలో పార్కింగ్‌కు స్థలాలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. దీనికి తోడు పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా రోడ్లు విస్తరించకపోవడంతో ఉదయం ఎనిమిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. 84 వీధుల్లో 30 వేలమంది జనాభాతోపాటు 1200 వాణిజ్యసముదాయాలు ఇక్కడ ఉన్నా యి. చుట్టుపక్కల మండలాల నుంచి ప్రతిరోజూ 20 వేల మంది వరకూ వివిధ పనుల నిమిత్తం నరసన్నపేట వస్తుంటారు. ఒడిశాలోని పలు ప్రాంతాలకు వెళ్లే కూడలికావడంతోపాటు జిల్లాలో వాణిజ్యపరంగా కీల కంగా ఉండే పట్టణం కావడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఈనేపథ్యం లో ఇక్కడి పోలీసుస్టేషన్‌లో 29 మంది సిబ్బందికి గాను 15 మంది డిప్యు టేషన్‌పై ఉన్నారు. వీరిలో ఒకరు మాత్రమే పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీ కరిస్తున్నారు. రోడ్డుపై వాహనాలు నిలిపివేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పలుబ్యాంకులు, కల్యాణమండపాలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు ఎటువంటి పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తుండడంతో ట్రాపిక్ సమస్య ఏర్పడుతోంది. ప్రస్తుతం పండగ సీజన్ కావడంతో దుస్తులు, నిత్యావసరసరుకుల కొనుగోలుకు చుట్టుపక్కల మండలాల నుంచి వేలాది మంది వస్తుండడంతో రోడ్లన్నీ కిటకిట లాడుతున్నాయి. పట్టణంలో దాదాపు 20 వాణిజ్యబ్యాంకులు, 14 ఫంక్షన్ హాళ్లు, 100కు పైగా హోటళ్లు, టిఫిన్ దుకాణాలు ఉండగా వాటిలో ఏ ఒక్కటిచోట సరైన పార్కింగ్‌లు లేవు. నిబంధనల ప్రకారం వాణిజంమ భవనాల హద్దు కొలతలతో 30శాతం, బహుళ గృహ సముదాయాల్లో 25 శాతం పార్కింగ్‌కు ఖాళీస్థలం కేటాయించాలి. ఏఒక్కరూ ఈనిబంధన పాటించడంలేదు.దీనికితోడు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక పోలీసు స్టేషన్ లేదు. పోలీసుస్టేషన్‌లో సిబ్బంది కొరత వల్ల ట్రాఫిక్ నియంత్ర ణపై పర్యవేక్షణ లేకుండా పోయింది.పల్లిపేట జంక్షన్ నుంచి వెంకటేశ్వర మహల్ వరకు మెయిన్ రోడ్డుపై వస్త్రదుకాణాలు ఎక్కువగా ఉండ డంతోపాటు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయడం వల్ల ప్రస్తుతం సంక్రాంతి కావడంతో నడిచివెళ్లడానికి కూడా వీల్లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. కాగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

# బంగారం తర్వాత పెట్టుబడులకు బెస్ట్ ఆప్షన్ ఇదేనా? కొత్త మెటల్‌పై విశ్లేషణ



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 06, సాధారణంగా బంగారం, వెండి ధరల గురించి ప్రజల్లో ఎప్పుడూ చర్చ కొనసాగుతూనే ఉంటుంది. తాజా ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలోనూ కనిపిస్తుంది. పెళ్లిళ్లు లేదా శుభకార్యాలు వచ్చినప్పుడు ముందుగా గుర్తొచ్చేది బంగారమే. గోల్డ్ ఆభరణాలు ధరించి నలుగురిలో ప్రత్యేకంగా కనిపించాలని చాలామంది కోరుకుంటారు. ముఖ్యంగా భారతదేశంలో బంగారానికి భావోద్వేగ విలువ ఎక్కువ. అలంకారంగా ధరించడమే కాకుండా దీన్ని ఒక భద్రమైన ఆస్తిగా కూడా భావిస్తారు. చేతిలో డబ్బులు ఉన్నప్పుడు గోల్డ్ కొనుగోలు చేసి దాచుకోవడం, అలాగే డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టడం కూడా ఇప్పుడు సాధారణమైపోయింది. ప్రస్తుతం ఎక్కడ చూసినా బంగారం, వెండి ధరల పెరుగుదల గురించే చర్చ జరుగుతుండగా, వీటితో పాటు ఇతర లోహాల విలువ కూడా క్రమంగా పెరుగుతోంది.బంగారం, వెండి ధరలు అంచనాలకు మించి పెరగడంతో గత కొంతకాలంగా రాగికి మంచి డిమాండ్ ఏర్పడింది. అనేక రకాల ఉత్పత్తుల తయారీలో రాగి విస్తృతంగా ఉపయోగించబడటంతో దాని ధరలు కూడా పెరుగుతున్నాయి. ఇదే సమయంలో మరో మెటల్ వేగంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. అదే లిథియం. ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా లిథియానికి భారీ డిమాండ్ పెరిగింది. దాంతో ఈ లోహంలో పెట్టుబడులు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. లిథియాన్ని ప్రధానంగా బ్యాటరీల తయారీలో ఉపయోగిస్తారన్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కెమెరాలు, ట్యాబ్లెట్‌ల తయారీలో కూడా దీని వినియోగం కీలకంగా మారింది. క్లీన్ ఎనర్జీ, ఇంధన రంగాల్లో లిథియం ప్రాధాన్యం మరింత పెరిగింది. డిమాండ్ పెరుగుతున్న కొద్దీ లిథియం ధరలు కూడా క్రమంగా ఎగబాకుతున్నాయి. అందువల్ల భవిష్యత్తులో ఈ మెటల్ మంచి లాభాలు అందించే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.సాంప్రదాయ బ్యాటరీలతో పోలిస్తే లిథియం బ్యాటరీలు వేగంగా ఛార్జ్ అవుతాయి. మెరుగైన పనితీరు, ఎక్కువ సామర్థ్యం వీటి ప్రధాన ప్రత్యేకతగా నిలుస్తున్నాయి. టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో లిథియం బ్యాటరీలకు డిమాండ్ తగ్గే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల రాబోయే కాలంలో వీటి అవసరం మరింతగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో లిథియం నిల్వల విషయంలో ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత చిలీ, అర్జెంటీనా, బొలీవియా, చైనా వంటి దేశాల్లో కూడా భారీ నిల్వలు ఉన్నాయి. ఇదే క్రమంలో భారత్ కూడా లిథియం వనరులపై దృష్టి సారించింది. దేశంలో లిథియం నిల్వల కోసం అన్వేషణను ప్రారంభించింది. క్లీన్ ఎనర్జీ రంగాన్ని అభివృద్ధి చేయడం, విదేశీ దిగుమతులపై ఆధారాన్ని తగ్గించుకోవడం లక్ష్యంగా ప్రభుత్వం లిథియం అన్వేషణకు ప్రాధాన్యం ఇస్తోంది.

# వాళ్లు పూలు పెడితే.. వీళ్లు క్యాలీఫ్లవర్లు పెడుతున్నారు..

## టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ చీఫ్ వైఎష్ షర్మిల విమర్శలు



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 06, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీద ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల మరోసారి విమర్శలు గుప్పించారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వైఎస్ షర్మిల.. తాజాగా జాబ్ క్యాలెండర్ అంశాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. టీడీపీ కూటమి సర్కారుతో పాటుగా వైసీపీపై కూడా విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ప్రకటిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు.. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఆ విషయంపై నోరెత్తడం లేదని షర్మిల విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తరుపున ఈ విషయంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.కూటమి పార్టీల రెండేళ్ల పాలన హామీలు ఘనం.. అమలుకు ఘరానా మోసం. ఏటా జనవరి వస్తోంది.. పోతోంది. సంవత్సరాలు మారుతూ క్యాలెండర్ మారుతున్నా.. ఫస్ట్ తారీఖున ఇస్తామని చెప్పిన జాబ్ క్యాలెండర్‌కు మాత్రం దిక్కులేదు. రికార్డు చేసి పెట్టుకోండని ఇచ్చిన వాగ్దానానికి విలువ లేదు. ఉద్యోగాల పేరుతో ఆశ చూపి, భారీగా నిరుద్యోగుల ఓట్లు దండుకుని, రెండో ఏడాది కూడా జాబ్ క్యాలెండర్‌పై ఊసెత్తకుండా, వారి జీవితాలతో చెలగాటం ఆడేందుకు కూటమి ప్రభుత్వానికి సిగ్గుండాలి. c అంటూ వైఎస్ షర్మిల ట్వీట్ చేశారు.

మరోవైపు వైసీపీపైనా వైఎస్ షర్మిల విమర్శలు గుప్పించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు జాబ్ క్యాలెండర్ పేరుతో యువత చెవుల్లో పూలు పెడితే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏకంగా క్యాలీఫ్లవర్లు పెడుతోందంటూ సెటైర్లు వేశారు. 2025 జనవరి 1 నుంచి క్రమం తప్పని జాబ్ క్యాలెండర్ ఎక్కడని ప్రశ్నించారు. రెండేళ్లలో రెండు జాబ్ క్యాలెండర్ల సంగతేంటి ? ఇదిగో అదిగో అని ఊరించడమే తప్పా ఉద్యోగాల భర్తీ షెడ్యూల్ ఏది ? కూటమి ప్రభుత్వ హామీ జాబ్ క్యాలెండర్ కాదు..జోక్ క్యాలెండర్. నిరుద్యోగ బిడ్డలను దగా చేసిన దగా క్యాలెండర్.. అంటూ షర్మిల తీవ్ర స్థాయిలో విమర్శించారు.

జాబ్ క్యాలెండర్ కోసం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 50 లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని.. ఉన్నది సైతం అమ్ముకుని కోచింగులు తీసుకుంటున్నారని షర్మిల పేర్కొన్నారు. వీరంతా ఉద్యోగాలు ఇస్తారా లేదా అనే తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ప్రభుత్వ విభాగాల్లో కలిపి ఖాళీలు 2 లక్షలకు పైగా ఉన్నాయన్న వైఎస్ షర్మిల.. వెంటనే రెండు లక్షల ఉద్యోగాలకు సంబంధించిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కొలువులు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, రాష్ట్ర నిరుద్యోగుల పక్షన డిమాండ్ చేస్తున్నామని వైఎస్ షర్మిల ట్వీట్ చేశారు.

# బొబ్బిలి-సాలూరు మధ్య ఒకప్పుడు నడిచిన రైలుబస్సు

క్రైం కౌంటర్ న్యూస్, బొబ్బిలి-సాలూరు మధ్య నడిచే రైలుబస్సును కరోనా కాలంలో నిలిపివేసిన తరువాత ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణం చేసే అనేక మంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల ద్వారా రైల్వే శాఖ ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా వినడం లేదు. రైలుబస్సును నడపలేమని రైల్వే శాఖ చెబుతున్నట్లు మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ గతంలో చెప్పారు. ఈ పరిస్థితిలో విశాఖ నుంచి విజయనగరం వచ్చే పాసింజర్ రైలును బొబ్బిలి మీదుగా సాలూరు వరకు పొడిగిస్తామని చెప్పడమే కాదు రెండేళ్ల కిందట ట్రయల్ రన్ కూడా చేపట్టారు. ఆ తర్వాత దీనిని కూడా విస్మరించారు.

బొబ్బిలి-సాలూరు పట్టణాల మధ్యలో నడిచే రైలు బస్సుతో స్థానిక ప్రయాణికులకు చాలా సౌకర్యంగా ఉండేది. వందలాది మంది చిరు వ్యాపారుల ఉపాధికి భరోసా లభించేది. 2020లో కరోనా దెబ్బకు రైలు బస్సును రైల్వే శాఖ ఆపేసింది. బ్రిటీషు కాలం నాటి నుంచి నడిచిన ఈ సర్వీసును ఎత్తివేశాక స్థానిక ప్రయాణికులు చాలా బాధ పడ్డారు. పునరుద్ధరించాలని విన్నపాలు అందించారు. ఉన్నతాధికారుల వల్ల వద్ద ప్రస్తావిస్తూ వచ్చారు. ఎన్ని చేసినా రైల్వే శాఖ వినలేదు. అయితే విశాఖ నుంచి విజయనగరం వరకు నడుస్తున్న మెము రైలు సర్వీసును బొబ్బిలి మీదుగా సాలూరు వరకు పొడిగిస్తూ రెండేళ్ల కిందట రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ఈ పరిణామంతో బొబ్బిలి, సాలూరు ప్రాంతీయులు చాలా సంతోషించారు. ఈ సర్వీసును ఎప్పటి నుంచి నడిచేదీ రెండుమూడురోజుల్లో ఆదేశాలు వస్తాయని అప్పట్లో రైల్వే అధికారులు ప్రకటించారు. ఏమైందో ఏమో కాని ఇప్పటివరకు ఈ లైనులో రైలు కూత వినిపించలేదు.

సాలూరులో రైల్వే స్టేషన్‌ను రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటీష్ పాలకులు నిర్మించారు. ఒడిశాకు సరుకు రవాణాకు ఈ రైల్వే స్టేషన్‌ను వినియోగించారు. సాలూరుకు గోధుమల రవాణా కూడా జరిగేది. సాలూరు-బొబ్బిలి మధ్య తొలుత బొగ్గుతో నడిచే రైలు, ఆ తర్వాత డీజిల్ ఇంజన్‌తో ట్రైన్ నడిచేది. నష్టాలు వస్తున్నాయని సాలూరు రైల్వే స్టేషన్‌ను 1998లో ఎత్తివేశారు. రైలు బస్సును మాత్రం నడిపారు. ఇది బొబ్బిలి- సాలూరు మధ్య ఐదు ట్రిప్పులు నడిచేది. దండిగాం రోడ్డులో స్టేజ్ ఏర్పాటు చేశారు. ఇదంతా నేడు చరిత్రగా చెప్పుకోవాల్సి వస్తోంది.

ఎందుకు ఆపినట్టో?

పాసింజర్ రైలును సాలూరుకు పొడిగించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పుడు ఈ ప్రాంతీయులు చాలా సంతోషించారు. అంతేకాక సాలూరు- బొబ్బిలి రైల్వే మార్గాన్ని విద్యుదీకరించారు. డీఆర్ఎం ఆధ్వర్యంలో ట్రయల్ రన్ సైతం చేశారు. ఈస్ట్‌కోస్టు రైల్వే విభాగం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. విశాఖలో ప్రతిరోజు సాయంత్రం ఆరు గంటల ఐదు నిమిషాలకు బయలుదేరే పాసింజర్ రైలు రాత్రి 7.25 గంటలకు విజయనగరం చేరుతుంది. ఈ రైలు విజయనగరం స్టేషన్‌లో మరుసటిరోజు ఉదయం 6.15 నిమిషాల వరకు ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్లాట్‌ఫారం సమస్య సైతం ఏర్పడింది. రాత్రి సమయంలో ఈ రైలు వల్ల ఇతర రైళ్ల రాకపోకలకు సిగ్నల్ ఇవ్వడానికి సమస్య వస్తోంది. ఈ నేపథ్యంలో ఏ రద్దీ లేని సాలూరు స్టేషన్‌లో ఉంచడమే ఉత్తమంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే భావించింది.

షెడ్యూల్ ప్రకటించి కూడా..

సాలూరు వరకు నడిచే పాసింజర్ రైలు షెడ్యూల్‌ను కూడా ప్రకటించారు. ప్రతి రోజు విశాఖలో ఆ రైలు సాయంత్రం 6.30 నిమిషాలకు బయలుదేరుతుంది. విజయనగరానికి రాత్రి 7.45 గంటలకు చేరుకుంటుంది. రాత్రి 7.50 గంటలకు విజయనగరంలో బయలుదేరి రాత్రి 8.50 నిమిషాలకు బొబ్బిలి చేరుకుంటుంది. రాత్రి 9.10 గంటలకు బొబ్బిలిలో బయలుదేరి రాత్రి 10 గంటలకు సాలూరు చేరుకుంటుంది. సాలూరులో మరుసటిరోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు ఈ రైలు విశాఖకు బయలుదేరుతుంది. ఈ రైలు ఉదయం 4.50 గంటలకు బొబ్బిలి, విజయనగరం 6.05 గంటలకు, విశాఖ ఉదయం 7.30 గంటలకు చేరుకుంటుంది. ఇంతలో షెడ్యూల్ ఇచ్చి కూడా రైలు పొడిగింపు నిర్ణయాన్ని అటకెక్కించారు.

రైలు సర్వీసును ప్రారంభించాలి

శంకరరావు, ప్రయాణికుల సంఘం ప్రతినిధి

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడినందున గిరిజన గ్రామాలవారికి, ఏజన్సీ ప్రాంతాలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు పార్వతీపురం జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు బొబ్బిలి-సాలూరు రైలు సర్వీసు చాలా ఉపయోగపడుతుంది. పాచిపెంట, సాలూరు, మక్కువ ప్రాంతాలకు చెందిన వారంతా వ్యయప్రయాసలు లేకుండా రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుంది. ట్రయల్ రన్‌తో సరిపెట్టి రైల్వేశాఖ చేతులు దులుపుకోవడం అన్యాయం. ఎంపీలు, కేంద్రమంత్రులు, ఎమ్మెల్యేలు బొబ్బిలి-సాలూరు-విశాఖ రైలు సర్వీసును వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా ఒత్తిడి తీసుకురావాలి.

# ఉచిత బస్సుకు ఆధార్ కార్డు వద్దు.. అలా అయితేనే పేదోళ్లకు మేలు..

## కొత్త ట్విస్ట్ఉచిత బస్సుకు ఆధార్ కార్డు వద్దు.. అలా అయితేనే పేదోళ్లకు మేలు.. కొత్త ట్విస్ట్

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 06,** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. రెండు తెలుగు రాష్ట్రాలలో వేర్వేరు పేర్లతో అమలవుతున్న ఒకే పథకం. తెలంగాణలో మహాలక్ష్మి పేరిట.. ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీశక్తి పేరుతో అమలవుతున్న ఈ పథకం ద్వారా రోజూ లక్షలాది మంది మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. ఆధార్ కార్డులు చూపించి పథకం ప్రయోజనాలు పొందుతున్నారు. ఇక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సులలో ఆక్యుపెన్సీ పెరిగింది. అక్కడక్కడా సీట్ల కోసం మహిళల సిగపట్లు కూడా కామన్‌గా మారిపోయాయి. అలాగే కండక్టర్లు, డ్రైవర్లతో వాగ్వాదాలు కూడా చోటుచేసుకుంటున్న పరిస్థితి. ఈ క్రమంలోనే ఓ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. విశాఖపట్నంలోని మద్దిలపాలెంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.




ఏపీఎస్ఆర్టీసీ బస్ కండక్టర్ సిగ్నల్ వద్ద బస్సు ఎక్కనివ్వడం లేదంటూ ఓ మహిళ ఈ వీడియోను రికార్డు చేశారు. సిగ్నళ్ల వద్ద బస్సు ఎక్కకూడదని.. అది రూలంటూ తనను బస్సు ఎక్కనివ్వలేదంటూ మహిళ వీడియోలో ఆరోపించారు. ఉచిత బస్సు పథకం పెట్టినప్పటి నుంచి ఆర్టీసీ సిబ్బంది ఓవరాక్షన్ చేస్తున్నారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ బస్సు మీద ఫిర్యాదు చేస్తానంటూ వీడియోలో చెప్పుకొచ్చారు. ఈ వీడియో సోషల్ మీడియాయోలో వైరల్ అవుతుండగా.. నెటిజనం భిన్న రకాలుగా స్పందిస్తున్నారు, ఈ క్రమంలోనే ఓ నెటిజన్.. ఆసక్తికర ప్రతిపాదన తెరపైకి తెచ్చారు.

మహిళలకు ఉచిత బస్సు పథకం రూల్ మార్చాలని.. ఉచిత ప్రయాణం కోసం ఆధార్ కార్డు కాకుండా రేషన్ కార్డు చూపించాలని అడగాలని సూచించారు. రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకున్నప్పుడే ఈ పథకం ద్వారా పేదవాళ్లకు ఉపయోగం ఉంటుందంటూ ట్వీట్ చేశారు. లేకపోతే ఆర్థిక స్థోమత ఉన్నా కూడా కొంతమంది అప్పనంగా ఫ్రీ బస్ ఉపయోగిస్తున్నారంటూ విమర్శించారు. ఈ ట్వీట్ కూడా ఇప్పుడు వైరల్ అవుతోంది. వాస్తవానికి ఉచిత బస్సు పథకం తెలుగు రాష్ట్రాల కంటే ముందే కర్ణాటక, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో అమల్లో ఉంది. కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు పథకం కోసం ప్రత్యేకంగా స్మార్ట్ కార్డులు జారీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే తరహా ఆలోచన చేస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కూడా ఇదే తరహా స్మార్ట్ కార్డు ఆలోచన చేయాలని కొంతమంది సూచిస్తున్నారు. రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవాలంటే కొన్ని ఇబ్బందులు వస్తాయని.. ఇంట్లో ఒకరి కంటే ఎక్కువ మంది మహిళలు ఉంటే.. అందరికీ రేషన్ కార్డులు ఉండవుగా అని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వమే మహిళలకు స్మార్ట్ కార్డులు జారీ చేయటం మంచిదనే ఆలోచనలు కూడా వస్తున్నాయి.

# నేటి నుంచి కందుల కొనుగోలు




**క్రైం కౌంటర్ న్యూస్,** కర్నూలు అగ్రికల్చర్, జనవరి 6 : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన కందులను కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ సంస్థ ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. రెండు నెలల క్రితమే రైతుల నుంచి కందులను ఈ సంస్థ ద్వారా కొనడానికి చర్యలు తీసుకోవలసి ఉన్నా... వివిధ కారణాల వల్ల ఆలస్యమైంది. రైతులు తమ అవసరాల కోసం ఇప్పటి దాకా వ్యాపారులకు అమ్ముకుని నష్టపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిన లేఖకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలో కందుల కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని నేషనల్ కోఆపరేటివ్ కన్జ్యూమర్స్ ఫెడరేషన ఆఫ్ ఇండియా.. మార్క్‌ఫెడ్ సంస్థకు ఆదేశాలు జారీ చేసిందని మార్క్‌ఫెడ్ మేనేజర్ రాజు విలేకరులకు తెలిపారు. కర్నూలు జిల్లాలో 25,875 టన్నులు కొనుగోలు చేసేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందని, ఇందుకు సంబంధించి రైతుల నుంచి కందుల కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, మంగళవారం నుంచి రైతు సేవా కేంద్రాల్లో జిల్లా మార్కెటింగ్ సొసైటీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటానికి రూ.8వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టామని డీఎం రాజు తెలిపారు. కేంద్రం క్వింటం కందులకు రూ.8వేలను మద్దతు ధరగా ప్రకటించిందని, రైతులు తొందరపడి దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని ఆయన తెలిపారు. మట్టి, చెత్త, తడి గింజలు లేకుండా కందులు పరిశుభ్రంగా ఉండాలని, కొనుగోలు చేసిన కందులకు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుందని డీఎం రాజు తెలిపారు.

# రైతు ఇంట సంక్రాంతి కళ కనిపించాలి



**క్రైం కౌంటర్ న్యూస్,** భోగాపురం/బొండపల్లి/డెంకాడ, జనవరి6: రైతులంతా సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని, వారు ఇబ్బంది పడకూడదనే ధాన్యం విక్రయించిన 24 గంటల్లో డబ్బులు జమ చేసిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జిల్లా పర్యటనకు మంగళవారం వచ్చిన ఆయన భోగాపురం గంగిరావి చెరువుకింద పంటపొలాల్లో ధాన్యం నూర్పు చేసిన రైతులతో మాట్లాడారు. ?గతంలో రైతులు ధాన్యం అమ్ముకోలేక అవస్థలు పడేవారని, మిల్లర్ల వద్దకు పంటను తీసుళ్లి వారం రోజులపాటు అక్కడే వేచి ఉండేవారన్నారు. ఇప్పుడు రైతు ధాన్యం మిల్లు వద్దకు తీసుళ్లిన వెంటనే తీసుకోవడం జరుగుతోందని, అదే విధంగా 24 గంటల్లో నగదు జమవుతోందని అన్నారు. సంక్రాంతి పండగను సంతోషంగా జరుపుకోవాలంటే రైతుల చేతుల్లో డబ్బులు ఉండాలని, గతంలో సంక్రాంతికి రైతులు ఇబ్బందులు పడేవారని అన్నారు. ఈప్రాంతంలో 1120 రకం ఎక్కువగా వేస్తున్నారని, ఈ విషయంలో రైతుల్లో మార్పు రావాలన్నారు. ధాన్యం మిల్లర్లకు అందజేయడం, నగదు జమకావడం, ధాన్యం తీసుళ్లడంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకొన్నారు. కౌలు రైతు పతివాడ పైడినాయుడు, రైతు సంగం అప్పలసూరి మాట్లాడుతూ గతం కన్నా ప్రస్తుతం చాలా బాగుందని, నగదు జమవుతోందన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే లోకంనాగమాధవి, సివిల్‌సప్లై కార్పొరేషన్ ఎండీ ఎస్.ఢిల్లీరావు, జేసీ సేదుమాధవన్, తహసీల్దార్ రమణమ్మ, ఎంపిడివో డిడిస్వరూపరాణి తదితరులు ఉన్నారు.

కొనుగోలులో నిర్లక్ష్యమెందుకు?

ధాన్యం కొనుగోలులో రైసు మిల్లుల యాజమాన్యాలు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నాయని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బొండపల్లి మండలం రాచకిండాంలో ధాన్యం నిల్వలు, సస్యరక్షణ చర్యలపై మంగళవారం రైతులతో మమేకమయ్యారు. అనంతరం బొండపల్లిలోని లక్ష్మనారాయణ రైస్‌మిల్లును తనిఖీ చేసి రైసు మిల్లర్ల అసోషియేషన్ ప్రతినిధులతో మాట్లాడారు. మిల్లర్ల నిర్లక్ష్యం కారణంగా 17 శాతం దిగువ స్థాయిలో మిల్లింగ్ చేయడం నిర్లక్ష్యనికి నిదర్శనమన్నారు. ఈ నెల 8వ తేదీలోగా 45 వేల మెట్రిక్ టన్నులు పూర్తిచేయని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలు చెల్లించడంలో అలక్ష్యంచేసి రైతులకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ జేడీ వీటి.రామారావు, డీఎస్‌వో టి.మురళీనాథ్, మాజీ మంత్రి పడాల అరుణ, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, బీజేపీ నేత పావని తదితరులు ఉన్నారు.

మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలి

మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలని, రైతులను ఇబ్బంది పెట్టవద్దని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. డెంకాడ మండలంలోని పెదతాడివాడ రైతు సేవ కేంద్రంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవితో కలిసి మంగళవారం రైతులతో ముచ్చటించారు. మిల్లర్లతో మాట్లాడి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రైతులతో మాట్లాడుతూ అధిక దిగుబడి వచ్చే వంగడాలపై అవగాహన పెంచుకోవాలని, రైతులకు అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. అనంతరం సచివాలయం వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ఏడాది గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పట్టణాల్లో గోధుమ పిండి కిలో రూ.20లకే అందజేస్తున్నామని, త్వరలో గ్రామాల్లో కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, టీడీపీ సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు, మాజీ జడ్పీటీసీ కంది సూర్యనారాయణ పాల్గొన్నారు.

పండుగ ముందే చెల్లింపులు

మంత్రి నాదెండ్ల మనోహర్

విజయనగరం, జనవరి 6 : పండుగ ముందు షెడ్యూలు వేసుకుని రానున్న నాలుగైదు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపులు వెంటవెంటనే జరిగేలా చూడాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. మంగళవారం జిల్లాకు వచ్చిన ఆయన జిల్లా పరిషత్ అతిథిగృహంలో పౌరసరఫరాలశాఖ ఎండీ ఎస్.ఢిల్లీరావుతో కలిసి అధికారులతో సమీక్షంచారు. ధాన్యం సేకరణలో సమస్యలపై గోడౌన్‌ల సదుపాయం, మిల్లర్ల బీజీల సమస్య, స్టోరేజీ తదితర అంశాలపై ఆరా తీశారు. క్షత్రస్థాయిలో సమస్య ఉంటే జాయింట్ కలెక్టర్ దృష్టిలో పెట్టాలని, మిల్లర్లంతా ప్రభుత్వం చెప్పినట్టు నడుచుకోవాలని సూచించారు. రాష్ట్రంలో 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు. 97.6 శాతం మంది రైతులకు 24 గంటల్లోనే రూ.680 కోట్లు జమ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, జాయింట్ కలెక్టరే సేతుమాధవన్, పౌరసరఫరాల జిల్లా మేనేజరు శాంతి, ఆర్‌డీఓ కీర్తి, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు పాల్గొన్నారు.

మంత్రికి విన్నపాలు

శృంగవరపుకోట, జనవరి 6 : మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జిల్లా పౌరసరఫరాల శాఖ డీలర్ల సంఘం జిల్లా కేంద్రంలో కలిసింది. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. రూ.5000 గౌరవ వేతనంతో పాటు క్వింటాకు రూ.300 కమీషన్ పెంచాలని, ఇతర నిత్యావసర వస్తువుల అమ్మకానికి డీలర్‌కు అనుమతి ఇవ్వాలని, కార్పొరేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు, కుటుంబ సభ్యులకు బీమా సదుపాయం, 60 సంవత్సరాలు దాటిన డీలర్లకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు సీహెచ్ రామారావు, కొణదం ఉమామహేశ్వరరావు, ముత్యాలనాయుడు ఉన్నారు. అలాగే శృంగవరపుకోట నియోజకవర్గ జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు పలు సమస్యలపై మంత్రికి వినతినిచ్చారు.

# ఇరుసుమండ ప్రమాదం.. ప్రభుత్వం కీలక నిర్ణయం



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 06,** డాక్టర్ అంబేద్కర్కోనసీమ జిల్లా మలికిపురంలోని ఇరుసుమండలో గ్యాస్ లీక్ అయిన సంగతి తెలిసిందే. ఇరుసుమండ బ్లోఅవుట్‌లో ఇంకా మంటలు అదుపులోకి రాలేదు. ఓఎన్‌జీసీ సిబ్బంది మంటలను నియంత్రించేందుకు శ్రమిస్తున్నారు. అయితే ఇరుసుమండ బ్లోఅవుట్ నిలిచిపోవటానికి ఇంకా ఐదు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. బ్లోఅవుట్‌లో 95 శాతం కట్టడి చేశామని.. మరో ఐదురోజుల పాటు బ్లోఅవుట్ కొనసాగుతుందన్నారు. అయితే ప్రమాదమేమీ లేదని క్లారిటీ ఇచ్చారు. పైపుల సాయంతో గూడవల్లి పంట కాల్వ నుంచి నీటిని మళ్లించి మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు.

ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక టీమ్ కూడా.. ఘటనాస్థలికి చేరుకుని మంటలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తోంది. కూలెంట్ ఆయిల్ సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నంలో ఉన్నారు. బ్లోఅవుట్ నియంత్రణలోకి వచ్చిన తర్వాత.. ఈ ఘటన ఎలా జరిగింది.. దీనికి బాధ్యులు ఎవరనే అంశంపై దృష్టి సారించనున్నారు.

మరోవైపుకోనసీమ గ్యాస్ లీక్నేపథ్యంలో చుట్టుపక్కల వారిని ఇప్పటికే సురక్షత ప్రాంతాలకు తరలించారు. 500 కుటుంబాలను చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలించినట్లు అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ వెల్లడించారు. వారికి అన్ని సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. మరోవైపు గ్యాస్ లీక్, భారీగా మంటలు ఎగసిపడిన నేపథ్యంలో ఆ చుట్టుపక్కల ప్రాంతంలో భారీగా పంట నష్టం సంభవించింది. పెద్దఎత్తున కొబ్బరి చెట్లు కాలిపోయాయి. అలాగే పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో కాలిపోయిన కొబ్బరిచెట్లకు, దెబ్బతిన్న పంటలకు నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తామని కోనసీమ జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

కోనసీమ బ్లోఅవుట్ – చంద్రబాబు సమీక్ష

కోనసీమ బ్లోఅవుట్‌పై సీఎం నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ లీకేజీని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. ప్రజలు భయాందోళనకు గురికాకుండా.. వారికి తాజా పరిస్థితులను వివరించాలని సూచించారు.

మంటలలో కొబ్బరి చెట్లు కాలిపోయిన రైతులకు పరిహారం అందించాలని చంద్రబాబు ఆదేశించారు. మంటలను అరికట్టేందుకు అవసరమైతే జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీల సహకారం తీసుకోవాలని సూచించారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా సంస్థలతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

# భోగాపురం ఎయిర్ పోర్టు ఘనత జగన్ దే

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 06,** భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ ఘనత ముమ్మాటికీ వైయస్.జగన్ దేనని, అయితే దాన్ని కూడా టీడీపీ నేతలు సిగ్గు లేకుండా తమ ఖాతాలో వేసుకుంటున్నారని వైయస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మండిపడ్డారు. విశాఖపట్నంలో వైయస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ఫస్ట్ టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ నేపథ్యంలో ఈ ఘనత తమదేనని చెప్పుకుంటున్న టీడీపీ నేతలు.. ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో వారి కంట్రిబ్యూషన్ ఏముందని ప్రశ్నించారు. క్రెడిట్ చోరీకి పాల్పడ్డం వారికి వెన్నతో పెట్టిన విద్య అని తేల్చి చెప్పారు. కేవలం ఉత్తరాంధ్ర ప్రజలను మభ్యపెట్టడానికే 2019 ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు అప్పటి సీఎం చంద్రబాబు హడావుడిగా ఎయిర్ పోర్ట్ పనులకు శంకుస్థాపన చేశారన్న అమర్నాథ్.. భూసేకరణ, అనుమతులు, ఆర్థిక వనరులు లేకుండా ఏ రకంగా నిర్మాణం చేస్తారని నిలదీశారు. 2019లో వైయస్.జగన్ ప్రభుత్వ హయాంలోనే ఎయిర్ పోర్టు కోసం భూసేకరణతో పాటు అన్ని రకాల అనుమతులు సాధించిన తర్వాతే 2023 మే 3 న నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారని స్పష్టం చేశారు. అదే రోజు జూన్ 2026 నాటికి ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న ఉత్తరాంధ్రా వాసుల ఆకాంక్షను వైయస్.జగన్ వెలిబుచ్చారన్న అమర్నాథ్... అందులో భాగమే నిన్నటి టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ అని స్పష్టం చేశారు. ఇదే వైయస్.జగన్ విజన్ కి తార్కాణమన్న అమర్నాథ్... విజన్ అంటే జగన్ – భజన అంటే బాబు తేల్చి చెప్పారు. నిర్వాసితులకు సైతం వైయస్సార్‌సీపీ హయాంలో న్యాయం చేస్తూ... నాలుగు గ్రామాల ప్రజలకు పరిహారం, మౌలిక సదుపాయల కల్పన కోసం సుమారు రూ.500 కోట్లు ఖర్చు పెట్టి రెండు చోట్ల కాలనీలు నిర్మించిన విషయాన్ని గుర్తు చేశారు. అయినా టీటీడీ నేతలు నిస్సిగ్గుగా ఆ విజయాన్ని తమ ఖాతాలో వేసుకోవడంతోపాటు ఎయిర్ పోర్టు విషయంలో కట్ పేస్ట్ వీడియోలతో వైయస్.జగన్ పై చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు.

# సినిమా



## పనిమనిషిలా ఉందని రిజెక్ట్ చేశా..

ఒకప్పుడు హీరోగా రాణించిన చాలా మంది ఇప్పుడు ఇండస్ట్రీలో సహాయక పాత్రల్లో నటిస్తూ మెప్పిస్తున్నారు. ఎంతో మంది నటులు ఇప్పుడు విలన్స్ గా, సహాయక పాత్రల్లో మెప్పిస్తున్నారు. వారిలో రామ్కీ ఒకరు. సిందూర పువ్వు అనే సినిమాతో ఒక్కసారిగా పాపులర్ అయ్యారు రామ్కీ. ఎన్నో సినిమాల్లో సూపర్ హిట్ సినిమాల్లో హీరోగా నటించిన ఆయన అలాగే పలు సినిమాల్లో సహాయక పాత్రల్లోనూ కనిపించారు రామ్కీ. గతంలో ఓ ఇంటర్వ్యూలో రామ్కీ మాట్లాడుతూ.. ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సిందూర పువ్వు చిత్రానికి ముందు రామ్కీ ఐదు సినిమాల్లో నటించి విజయవంతమైన నటుడిగా పేరు తెచ్చుకున్నారు.సింధూరపువ్వు సినిమా కోసం దర్శకుడు, నిర్మాత అయిన తన స్నేహితుడు అబావనన్ హీరోయిన్ నిరోషాను సూచించినప్పుడు, లండన్ నుండి వచ్చిన నిరోషాను చూసి రామ్కీ మొదట నిరాకరించారట. ఈ అమ్మాయి బాగాలేదు, వద్దు, పనిమనిషిలా ఉంది అని అన్నారట. అయినప్పటికీ, నిరోషా సింధూరపువ్వు చిత్రంలో హీరోయిన్ గా ఫిక్స్ చేశారు. అంతకన్నా ముందు కమల్ హాసన్ సినిమాలో నటించింది ఆ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అయితే రామ్కీ నిరోషాను రిజెక్ట్ చేసిన విషయం ఆమెకు తెలిసిపోయిందట.. దాంతో షూటింగ్ మొదటి రోజు నుంచే వారిద్దరి మధ్య గొడవలు జరిగాయని తెలిపారు. అయితే, ఈ గొడవలే క్రమంగా రొమాన్స్‌గా మారాయి. రామ్కీ, నిరోషా కలిసి దాదాపు ఎనిమిది చిత్రాల్లో నటించారు, అందులో ఏడు చిత్రాలు వంద రోజులు ప్రదర్శించబడ్డాయి. సంవత్సరానికి రెండు, మూడు సినిమాలు చేస్తూ దాదాపు వంద రోజుల పాటు కలిసి ప్రయాణించి, నటించడం ద్వారా వారి మధ్య బంధం బలపడిందని తెలిపారు రామ్కీ.అయితే షూటింగ్ సమయంలో నిరోషాకు కొన్ని ప్రమాదాలు జరిగినప్పుడు రామ్కీ ఆమెను రక్షించినట్లు కూడా తెలిపారు. రామ్కీ తమ వివాహం గురించి ఆలస్యంగా ప్రకటించినట్లు వివరించారు. 1998లో పెళ్లి చేసుకున్నప్పటికీ, 1987 నుంచే వారు సహజీవనం (లివింగ్ టుగెదర్) చేసినట్లు తెలిపారు. రామ్కీ ఆ రోజుల్లో రొమాంటిక్ హీరోగా ఎన్నో ప్రేమ ప్రపోజల్స్ అందుకున్నారని, వాటి వల్ల కొన్ని సమస్యలు కూడా ఎదురయ్యాయని పంచుకున్నారు. అయితే, నిరోషాకు ఎవరు ముందు ప్రపోజ్ చేశారన్న ప్రశ్నకు, సినిమాల్లో లవ్ డైలాగ్‌లు చెప్పి, పదిసార్లు మంగళసూత్రాలు కట్టడం సర్వసాధారణం అయింది అని సమాధానమిచ్చారు. రీల్ లైఫ్‌లో చెప్పిన డైలాగ్‌లు రియల్ లైఫ్‌లో కూడా వారికి ఉపయోగపడ్డాయని, వారి ప్రేమ సహజంగానే వికసించిందని రామ్కీ వివరించారు.





## గుమ్మడి గింజలా మజాకా..?

గుమ్మడికాయ.. దాదాపు ప్రతి ఇంట్లోనూ ఏదో ఒక సందర్భంలో తప్పనిసరిగా చూసి, ఉపయోగించి ఉంటారు.. ముఖ్యంగా పండుగల సమయంలో ఇల్లు, ఆఫీసులు, వ్యాపారలకు దిష్టి తీసేందుకు ఎక్కువగా వాడుతుంటారు. అలాగే, దిష్టి తగల కుండా పసుపు, కుంకుమలతో అలంకరించి ఎదురుగా ఇల్లు,ఆఫీసుల బయట రూఫ్‌కి కడుతుంటారు. అలాటే, కొందరు రకరకాలుగా వండుకుని తింటారు. కూర, సాంబార్, స్వీట్స్ ఇలా చాలా వెరైటీలు తయారు చేస్తారు. అయితే, ఈ సారి మీరు గుమ్మడికాయను కోసినప్పుడు దాని విత్తనాలు కనిపిస్తే వదలకండి. అవేవో పనికిరాని చెత్తగా భావించి చెత్తబుట్టలో వేసారంటే మీరు చాలా నష్టపోతారు. ఎందుకంటే.. ఈ విత్తనాలు అద్భుతమైన ఆరోగ్యాన్ని ప్రసాదించే ఆరోగ్య సిరులు అంటున్నారు ఆయుర్వేదా పోషకాహార నిపుణులు. ఆయా లాభాలేంటో ఇక్కడ చూద్దాం..గుమ్మడికాయ ఆరోగ్య ప్రయోజనాలు ఇటీవలి కాలంలో బాగా ప్రచారంలోకి వచ్చింది. చాలా మంది గుమ్మడి కూర, చారు, జ్యూస్ రూపంలో విరివిగా తీసుకుంటూ ఉన్నారు. అయితే, గుమ్మడి కాయ మాదిరిగానే గుమ్మడి గింజలు కూడా పుష్కలమైన ప్రయోజనాలు కలిగి ఉన్నాయి. వాటిలో ఫైబర్, కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్, కొవ్వు, విటమిన్ సి, విటమిన్_, భాస్వరం, మాంగనీస్, మెగ్నీషియం ఉన్నాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.

ప్రపంచవ్యాప్తంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. గుండె సమస్యలకు గుమ్మడి గింజలు చక్కటి పరిష్కారం అంటున్నారు పోషకాహార నిపుణులు. గుమ్మడికాయ గింజల్లో ఉండే మెగ్నీషియం, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. ప్రతిరోజూ సుమారు 2 గ్రాముల గుమ్మడికాయ గింజలను తినమని చెబుతున్నారు. వీటిలో ఉండే పొటాషియం, ఫైబర్, విటమిన్ సి మన హృదయాలను ప్రమాదం నుండి రక్షస్తాయి. అలాగే, వయసు పెరిగే కొద్దీ కీళ్ల నొప్పులు చాలా ఇబ్బందికరంగా మారుతాయి.గుమ్మడి గింజలు ఆర్థరైటిస్ నుండి ఉపశమనం పొందడానికి పనిచేస్తాయి. నొప్పి నుండి ఉపశమనం అందిస్తుంది. అంతేకాదూ నిద్రలేమికి కూడ ఇది దివ్యౌషధంగా పనిచేస్తుంది. గుమ్మడి గింజలు శరీర శక్తిని పెంచుతుంది. అప్పుడు మీరు కొత్త ఉత్సాహంతో పని చేయగలుగుతారు. వీటిలో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది సరైన జీర్ణక్రియను నిర్వహించడానికి సహాయపడుతుంది. మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది.



## రోజు ఒక స్పూన్ పొద్దుతిరుగుడు గింజలు తింటే చాలు.

మహిళల శరీరంలో హార్మోన్ల సమతుల్యతలో అనేక హెచ్చుతగ్గులు ఉంటాయి. వయసు పెరిగే కొద్దీ ఈ మార్పులు వారిని చాలా ఇబ్బంది పెట్టడం ప్రారంభిస్తాయి. దీని కారణంగా వారు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. మహిళలు తరచుగా చిరాకుగా కనిపిస్తుంటారు. చిన్న విషయాలకే కోపంగా ఉండటం ప్రారంభిస్తారు. దీంతో పాటు పీరియడ్స్ సమయంలో తీవ్రమైన కడుపు, వెన్నునొప్పి సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది మహిళలకు ఎక్కువ రోజుల ముందుగానే పీరియడ్స్ నొప్పులు రావడం ప్రారంభిస్తాయి.. అలాంటి మహిళలు సమస్యను ఎలా వదిలించుకోవాలో తెలియక చాలా ఆందోళన చెందుతారు. కానీ, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.. ఎందుకంటే..అటువంటి పరిస్థితుల్లో కొన్ని విత్తనాలు మీకు ఆరోగ్యానిస్తాయి. అందులో ఒకటి పొద్దుతిరుగుడు. ఈ విత్తనాల ప్రయోజనాలేంటో ఇక్కడ చూద్దారౌపొద్దుతిరుగుడు విత్తనాలు చాలా శక్తివంతమైనవి. దీనిలో ప్రోటీన్, కొవ్వు మంచి పరిమాణంలో ఉంటుంది. అంతేకాదు.. అనేక రకాల విటమిన్లు, జింక్, మాంగనీస్, రాగి, మెగ్నీషియం, ఇనుము, పాంతోతేనిక్ ఆమ్లం వంటివి సమృద్ధిగా లభిస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలలో ఇతర విత్తనాల కంటే ఎక్కువ విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అంతేకాదు..క్యాన్సర్‌ను నివారించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. థైరాయిడ్, ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారు కూడా పొద్దుతిరుగుడు విత్తనాలను తీసుకోవాలి. ఇది ఎముకలను బలపరుస్తుంది. కణాల పెరుగుదలకు సహాయపడుతుంది. ఈ విత్తనంలో సరైన మొత్తంలో అయోడిన్, సెలీనియం ఉంటాయి. ఇది థైరాయిడ్ హార్మోన్‌ను సమతుల్యం చేస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో విటమిన్ జు, ఫ్లేవనాయిడ్లు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షస్తాయి. పొద్దుతిరుగుడు విత్తనాలను క్రమం తప్పకుండా తీసుకుంటే అనేక రకాల క్యాన్సర్‌ల నుండి రక్షంచుకోవచ్చు. ఈ విత్తనాల్లోని విటమిన్ జు క్యాన్సర్ నిరోధకమే కాకుండా గుండెను బలంగా చేయడంలో కూడా చాలా శక్తివంతమైనది. ఇది గుండె నుండి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగిస్తుంది. ట్రైగ్లిజరైడ్‌లను కూడా తగ్గిస్తుంది. గుండెలో మంటను నివారిస్తుంది. పొద్దుతిరుగుడు విత్తనాలలో అనేక రకాల ఖనిజాలు ఉంటాయి. వాటిలో మెగ్నీషియం, పాంటోథెనిక్ ఆమ్లం ఉన్నాయి. ఇవి కండరాల నొప్పులను తగ్గిస్తాయి. అందువల్ల, కండరాల సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది

## ఎవరీ అమన్ రావు?

విజయ్ హజారే ట్రోఫీలో మరో సంచలనం నమోదైంది. హైదరాబాద్ ఓపెనర్ అమన్ రావు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయి డబుల్ సెంచరీతో చరిత్ర సృష్టించాడు. బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిపించిన ఈ కుర్రాడు, ఇన్నింగ్స్ ఆఖరి బంతికి సిక్సర్ బాది తన డబుల్ సెంచరీ పూర్తి చేయడం విశేషం. ఇంతకీ ఎవరీ అమన్ రావు? అమెరికాలో పుట్టి భారత్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న ఈ కుర్రాడి కథేంటో చూద్దాం.

సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో అమన్ రావు విధ్వంసం సృష్టించాడు. టాస్ గెలిచిన బెంగాల్ బౌలింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ ఓపెనర్లు రాహుల్ సింగ్ (65), అమన్ రావు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. అమన్ మొదట నిలకడగా ఆడి 108 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. అయితే, వంద పరుగులు దాటాక అమన్ విశ్వరూపం చూపించాడు. తర్వాతి 100 పరుగులను కేవలం 46 బంతుల్లోనే బాదేశాడు. ఆకాశ్ దీప్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో, చివరి బంతికి ముందు అమన్ 194 పరుగుల వద్ద ఉన్నాడు. ఆఖరి బంతిని స్టాండ్స్‌లోకి పంపి అద్భుతమైన రీతిలో తన డబుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 154 బంతుల్లో 200 పరుగులు చేసిన అమన్ ఇన్నింగ్స్‌లో 13 భారీ సిక్సర్లు, 12 ఫోర్లు ఉన్నాయి.

అమన్ రావు నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అతను జూన్ 2, 2004న అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలోని మాడిసన్ నగరంలో జన్మించాడు. పుట్టింది అమెరికాలోనే అయినా, తన క్రికెట్ కలను నెరవేర్చుకోవడానికి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇప్పుడు ఇక్కడ డొమెస్టిక్ క్రికెట్‌లో పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. కేవలం 3 లిస్ట్-ఏ మ్యాచ్‌ల్లోనే 252 పరుగులు, 11 టీ20ల్లో 301 పరుగులు చేసి తన సత్తా చాటుకున్నాడు.

అమన్ రావు టాలెంటును ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఇప్పుడే గుర్తించాయి. ఐపీఎల్ 2026 వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు అతడిని రూ. 30 లక్షల బేస్ ప్రైస్‌కు కొనుగోలు చేసింది. వేలంలో తక్కువ ధరకే దొరికిన ఈ వజ్రాన్ని రాజస్థాన్ ఎలా వాడుకుంటుందో చూడాలి. ప్రస్తుత విజయ్ హజారే ఫామ్‌ను చూస్తుంటే ఐపీఎల్‌లో కూడా అమన్ తన బ్యాట్‌తో విధ్వంసం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. తిలక్ వర్మ ప్టెన్సీలో ఆడుతున్న అమన్, భవిష్యత్తులో టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.



## కేఎల్ రాహుల్‌కు ఏమైంది?

టీమిండియా స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్ ఫామ్ ఇప్పుడు సెలెక్టర్లకు పెద్ద తలనొప్పిగా మారింది. న్యూజిలాండ్‌తో కీలకమైన వన్డే సిరీస్ ముంచుకొస్తున్న తరుణంలో విజయ్ హజారే ట్రోఫీలో తన హెూమ్ టీమ్ కర్ణాటక తరఫున ఆడుతున్న రాహుల్ వరుసగా విఫలమవుతున్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లు విశ్రాంతి తీసుకుంటుంటే, ఫామ్ కోసం దేశవాళీ బరిలోకి దిగిన రాహుల్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు.

జనవరి 3న త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ కేవలం 35 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. కనీసం రాజస్థాన్‌తో జరిగిన రెండో మ్యాచ్‌కైనా పుంజుకుంటాడని ఆశించిన అభిమానులకు నిరాశే ఎదురైంది. మంగళవారం (జనవరి 6) జరిగిన ఈ పోరులో రాహుల్ కేవలం 25 పరుగులు చేసి చేతులెత్తేశాడు. న్యూజిలాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్‌లో అతనే వైట్ కీపర్ బ్యాటర్‌గా ప్రధాన బాధ్యత తీసుకోవాల్సి ఉంది. ఇలాంటి సమయంలో రాహుల్ బ్యాట్ ఝుళిపించకపోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది.

గతంలో సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో కేఎల్ రాహుల్_ప్టెన్‌గా భారత్‌కు 2-1తో సిరీస్ విజయాన్ని అందించాడు. ఆ సిరీస్‌లో వరుసగా రెండు హాఫ్ సెంచరీలు (60, 66 పరుగులు) చేసి మంచి టచ్‌లో కనిపించాడు. అయితే ఇప్పుడు కివీస్ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్_ప్టెన్‌గా తిరిగి వస్తుండటంతో, రాహుల్ కేవలం మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా, వైట్ కీపర్‌గా జట్టును ఆదుకోవాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుత ఫామ్ చూస్తుంటే మిడిల్ ఆర్డర్‌లో రాహుల్ ఎంతవరకు నిలబడతాడనేది ప్రశ్నార్థకంగా మారింది.

33 ఏళ్ల రాహుల్ వన్డే_రీర్ రికార్డులు చాలా బలంగా ఉన్నాయి. 2016లో జింబాబ్వేపై అరంగేట్రం చేసిన అతను ఇప్పటివరకు 91 వన్డేల్లో 49.50 సగటుతో 3,218 పరుగులు సాధించాడు. ఇందులో 7 సెంచరీలు, 20 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే గత 10 వన్డేల్లో కేవలం రెండు హాఫ్ సెంచరీలు మాత్రమే రావడం అతని ఫామ్ పడిపోతోందని చెప్పడానికి నిదర్శనం. వచ్చే వారం నుంచే కివీస్ సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రాహుల్ తన బ్యాటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com